క్లుప్తంగా

వర్షంతో రైతుల ఆందోళన



ధూళికట్టలో కురుస్తున్న వర్షం

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట, ఎలిగేడు, ముప్పిరితోట తదితర గ్రామాల్లో బుధవారం వర్షం కురిసింది. ముప్పిరితోటలో రాళ్ల వన పడింది. ఇప్పటికే మండలంలో వడగండ్ల వానలు కురవడంతో వరి మొక్కజొన్న, మామిడి, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షాలు ఇంకా కురుస్తుండటంతో పంటలు చేతికి వచ్చే పరిస్థితి కనపడటం లేదని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పంటలను నష్ట పోయామని అధికారులు, ప్రజాప్రతినిధులు పంటల పరిహారం ఇప్పించేలా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

జూలపల్లిలో రాళ్ల వర్షం

జూలపల్లి: మండలంలో బుధవారం సాయంత్రం గాలి దూమారంతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా మబ్బులు వచ్చి కొద్దిపాటి రాళ్ల వర్షం కురియడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నాలుగు రోజుల క్రితం పడ్డ రాళ్ల వర్షం మొక్కజొన్నకు తీవ్ర నష్టం కలగజేసింది. దీన్ని మరువక ముందే మళ్లీ స్వల్పంగా రాళ్లతో వర్షం కురవడంతో ఆందోళన చెందారు. పెద్దాపూర్‌లో పెసరు లచ్చయ్యకు చెందిన ఆరెకరాల మామిడి తోటలో కాయలు రాలాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

కమాన్‌పూర్: మండలంలోని సిద్దిపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి సర్పంచ్ తాటికొండ శంకర్ బుధవారం భూమిపూజ చేశారు. ఉపాధిహామీ పథకంలో భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరయ్యాయి. భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం కమాన్‌పూర్ గ్రామ పరిధిలో ఉండగా గతంలోనే ఆరోగ్య ఉప కేంద్రానికి కేటాయించారని అదే స్థలంలో సిద్దిపల్లె గ్రామపంచాయితీ భవన నిర్మాణం ఎలా చేపడుతారని కమాన్‌పూర్ గ్రామపంచాయితీ పాలకవర్గ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో భవన నిర్మాణం వివాదస్పదంగా మారింది.

ఎంపీపీకి ఉగాది పురస్కారం



ఎంపీపీని సన్మానిస్తున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్: ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్‌కు జిల్లా యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మల్లికార్జున ఆలయంలో ఉగాది పురస్కారం అందించారు. ఓదెల దేవస్థానం చైర్మన్ మేకల మల్లేశ్ యాదవ్, ఓదెల జెడ్పీటీసీ గంట రాములు యాదవ్, ఎంపీపీ సంపత్ యాదవ్‌కు జ్ఞాపిక అందించి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు కన్నబోయిన ఓదెలు, కిరణ్ యాదవ్, మారం తిరుపతి యాదవ్, రాజకొమురయ్య యాదవ్, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం



రాజేశంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చందర్

రామగిరి: మండలంలోని లద్నాపూర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి నూనె రాజేశంను బుధవారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శాలువాతో సన్మానించారు. గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనంలో పాల్గొన్న కవి, రచయిత, సోషల్ వర్కర్ నూనె రాజేశం ఉగాది గొప్పతనం గురించి కవితా గానం చేశారు. దీనికి రాజేశంను ఎమ్మెల్యే చందర్ శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు.



జూలపల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం



యైటింక్లయిన్ కాలనీలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



సుల్తానాబాద్ శివాలయంలో పంచాంగ శ్రవణం



ధర్మారం మార్కండేయ ఆలయంలో..



గోదావరిఖనిలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

ఘనంగా ఉగాది వేడుకలు

తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పెద్దపల్లి జిల్లా కేంద్రం, రామగుండం, గోదావరిఖని పట్టణాలు, మంథని, సుల్తానాబాద్, అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో ఉగాది సంబురాలు ఘనంగా నిర్వహించారు. అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి పంచాంగ శ్రవణం పఠించారు. ఇళ్లల్లో ఉగాది పచ్చడి, బచ్చళ్లు చేసుకుని ఆరగించారు. ఆలయాల్లో పలువురు నాయకులు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఉగాది పండుగ సందర్భంగా ఆలయాల్లో సందడి నెలకొంది. ఓదెల మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు రద్దీ నెలకొంది. ఆలయాల్లో వేదపండితులు పంచాంగ శ్రవణం చేసి ఆదాయ వ్యయాలు వివరించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆదివరాహస్వామిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు దంపతులు



ఓదెల మల్లికార్జున దేవస్థానంలో పంచాంగ శ్రవణం



రామగుండంలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లత



పంచాంగ శ్రవణానికి హాజరైన ఆర్జీ-2 జీఎం దంపతులు



మంథనిలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్



ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న జీఎం కె.నారాయణ



గోదావరిఖని టౌన్: ఉగాది పచ్చడి స్వీకరిస్తున్న ముస్లిం



కాల్వశ్రీరాంపూర్‌లో వాహనపూజలు



ఓదెల మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

సింగరేణి బీ గెస్ట్‌హౌస్‌లో ఐటీ పార్క్

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: సింగరేణి బీ గెస్ట్‌హౌస్‌లో తాత్కాలిక ఐటీ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం గెస్ట్‌హౌజ్‌ను సందర్శించి అందులో వసతులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఐటీపార్కు కోసం బీ గెస్ట్‌హౌజ్ కేటాయించాలని సంస్థ సీఅండ్ ఎండీని కోరగా, అనుమతుల ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఐటీ పార్క్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రామగుండం మున్సిపల్ కార్యాలయం వెనుక ఎకరం 26 గుంటల భూమిని కేటాయించారన్నారు. ఐటీ పార్క్ భవన నిర్మాణానికి ఏడాదికి పైగా పడుతున్న నేపథ్యంలో సింగరేణి బీ గెస్ట్‌హౌజ్‌లో తాత్కాలికంగా ఐటీ పార్క్ ఏర్పాటు చేయనున్నమన్నారు.



గెస్ట్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చందర్

దీనికి కావాల్సిన సదుపాయాలు అవసరమైన మౌలిక వసతులు నెల రోజుల్లో పూర్తి చేయాలని సింగరేణి అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట ఆర్జీ–1 జీఎం కె.నారాయణ, టీబీజీకేఎస్ నాయకులు జాహిద్‌పాషా తదితరులున్నారు.

యాదవుల సంక్షేమానికి కృషి

ఓదెల: యాదవుల సంక్షేమానికి తనవంతుగా కృషి చేస్తానని టీపీసీసీ సభ్యుడు, జెడ్పీటీసీ గంట రాములు యాదవ్ అన్నారు. బుధవారం ఓదెల మల్లికార్జునస్వామి ఆలయం ఆవరణలో యాదవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో పాల్గొని మాట్లాడారు. యాదవులు అన్ని రంగాల్లో ముందుక రావాలని ఆకాంక్షించారు. విద్యలో అందరూ ముందుండాలని, రాజకీయంగా ఎదగాలని కోరారు.అనంతరం వివిధ రంగాల్లో యాదవుల అభ్యున్నతికి కృషిచేస్తున్న పలువురిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఓదెల మల్లికార్జునస్వామి ఆలయ చైర్మన్ మేకల మల్లేశం యాదవ్, ఉపసర్పంచ్ గ్యారవేని నాగరాజు, యాదవసంఘం జిల్లాప్రతినిది శిలారపు పర్వతాలుయాదవ్, నాయకులు కన్నెబోయిన ఓదెలుయాదవ్, కాల్వశ్రీరాంపూర్ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ఉగాది పురస్కారం అందిస్తున్న జెడ్పీటీసీ

ఇళ్ల స్థలాలు కేటాయించే వరకూ పోరాటం

జ్యోతినగర్: పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు భూ పోరాటం ఆగదని సీపీఎం ఏరియా కార్యదర్శి ఎం.రామాచారి స్పష్టం చేశారు. బుధవారం రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో శ్రీశోభకృత్ ఉగాది వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదలు ఇళ్ల స్థలాల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ కేటాయించాలన్నారు. ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రామగుండం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని, తక్షణమే సర్వే చేయించి ప్రభుత్వ భూమిని గుర్తిస్తామని ఆయన హామీ ఇచ్చారని వెల్లడించారు. భూ ఆక్రమణదారులు సీపీఎం చేసే పోరాటాలను విచ్చిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పేదల కోసం చేస్తున్న పోరాటానికి సీపీఎం వెనుకంజ వేయదని జరగదని స్పష్టం చేశారు. టెంట్లు కూల్చేసినా భూ పోరాటం ఆగదని స్థలాలు కేటాయించేవరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మహేశ్వరి, 2వ, 4వ డివిజన్ల కార్యదర్శుల గీట్ల లక్ష్మారెడ్డి, నాగలక్ష్మి, భిక్షపతి, ఉపేందర్, రవీందర్, శంకర్, రమణ, సురేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమి వద్ద ఉగాది వేడుకలు

స్వాములకు అన్నదానం

ఎలిగేడు: శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఎలిగేడు మండల కేంద్రంలోని శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో కేసీఆర్ సేవాదళం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వాములకు కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి శాతల్ల కాంతయ్య, జిల్లా యూత్ ప్రధానకార్యదర్శి బొద్దుల సాయినాథ్, మండల అధ్యక్షుడు బింగి రాజు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



సుగ్లాంపల్లిలో బోనాలతో వస్తున్న ప్రజలు

సుల్తానాబాద్: పట్టణంలోని సుగ్లాంపల్లిలో మల్లికార్జున స్వామికి బుధవారం బోనాలు చేశారు. గ్రామంలో కులాలకతీతంగా అందరూ బోనాలను ఎత్తుకొని స్వామివారి వద్దకు చేరుకున్నారు. డప్పు చప్పుళ్లు, శివసత్తులు పూనకాల మధ్య ఊరేగింపుగా వచ్చారు. స్వామివారికి పట్నాలు వేయడంతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు, నల్ల ఫౌండేషన్ చైర్మన్ నల్ల మనోహర్ రెడ్డి, కౌన్సిలర్ పసేడ్ల మమత,సంపత్ పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు

న్యూ మారేడుపాకలో మల్లన్న పట్నాలు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక లోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం మల్లన్న దేవునికి పట్నాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఒగ్గు కళాకారులు పట్నాలు వేసి మల్లన్న దేవుని కథను వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కోనరావుపేటలో ఒగ్గు కళాకారుల విన్యాసాలు

జూలపల్లి: మండలంలోని కోనరావుపేటలో బుధవారం మల్లన్న పట్నాల ఉత్సవంలో భాగంగా బోనాలు చేశారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఇంటికో బోనం చొప్పున డప్పు చప్పుళ్ల మధ్య తీసుకువెళ్లి ఆలయ ఆవరణలో ఒగ్గు పూజారులు వేసి పట్నాలపై పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ మంగ, ఉపసర్పంచ్,యాదవ సంఘం నాయకులు రాయమల్లు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోమాతకు ప్రత్యేక పూజలు



గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

సుల్తానాబాద్: పట్టణంలోని యాదవ్ నగర్ గోశాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆవులను కడిగి కుంకుమ పసుపు పూలతో అలంకరించారు. గోమాతలో దేవతలు కొలువై ఉంటారని, గోశాల వ్యవస్థాపక అధ్యక్షుడు బండారి సూర్య అన్నారు. గోవులకు పండ్లు ఆకుకూరలను అందజేశారు. కార్యక్రమంలో గోశాల ఉపాధ్యక్షుడు మామిల్ల రాకేశ్, ప్రధాన కార్యదర్శి నూక రాందాస్, కోశాధికారి బండారి భాగ్యలక్ష్మి , ముఖ్య సలహాదారులు ఆలూరి శ్రీనివాస్ రావు, సభ్యులు శ్రీనివాస్, సుల్తానాబాద్ మండల వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు హెల్మెట్లు పంపిణీ



హెల్మెట్ అందిస్తున్న వైస్ ఎంపీపీ స్వామి

పాలకుర్తి: మండలంలోని ఈసాల తక్కళ్లపల్లికి చెందిన మంత్రి అవినాష్ అనే యువకుడు గ్రామానికి చెందిన పలువురికి ఉచితంగా హెల్మెట్లను అందజేశారు. ఉగాది పండుగ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవినాష్ హెల్మెట్లను వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి చేతుల మీదుగా స్థానికులకు అందించారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండి శ్రీనివాస్‌గౌడ్, హరీష్‌తో స్థానికులు పాల్గొన్నారు.

మడేలేశ్వరస్వామి ఆలయానికి మైక్‌సెట్ అందజేత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని మడేలేశ్వరస్వామి ఆలయానికి ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ కు చెందిన సతీశ్ రూ.15వేల విలువ చేసే మైక్‌సెట్‌ను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో రజకసంఘ నాయకులు వెంకటేశం, అశోక్, జగదీశ్, మల్లికార్జున్, శంకర్, కృష్ణ తదితరులున్నారు.

పాలకుర్తిలో వాలీబాల్ టోర్నమెంట్

పాలకుర్తి: మండల కేంద్రంలో ఉగాది పండగ పర్వదినం సందర్భంగా గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. సర్పంచ్ దుర్గం జగన్ పోటీలను ప్రారంభించి విజేతలకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందజేశారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోకుండా క్రీడలపట్ల ఆసక్తి పెంచుకుని ఉన్నతస్థాయిలో రాణించాలని సర్పంచ్ జగన్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాదాసు సతీశ్, పెద్దపల్లి పవన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

రామగిరి: మండలంలోని నాగేపల్లిలో సీసీరోడ్ల నిర్మాణ పనులను సర్పంచ్ కొండవేన ఓదెలు యాదవ్ అన్నారు. ఆయన ప్రారంభించారు. గ్రామానికి రూ 30 లక్షల నిధులు కేటాయించిన జెడ్పీచైర్మన్ పుట్ట మధుకు గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిట్టెంపల్లి అనిల్ కుమార్, నాయకులు దుద్దిల రాజు, సట్ల రాజకుమార్, గద్దల శంకర్, వేగోలపు శ్రీనివాస్ గౌడ్, కొండవేన సుధాకర్ యాదవ్, ప్రభాకర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూ

పాలకుర్తి:మండల పరిధిలో దివ్యాంగుల సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 24న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఒరిజినల్ డాక్యుమెంట్స్,ఆధార్‌కార్డు, సదెరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆధాయ ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.